నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 23 జూన్ 2025 SANGAREDDY

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాలలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జూన్ 22 : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో ఇటీవట బీఆర్‌ఎస్ నాయకుడు మంగలింగం సతీమణి వాణి, కుమ్మరి శ్రీనివాస్ తండ్రి లచ్చయ్య, నిమ్మ బాలవ్వ వివిధ కారణాల చేత మృతి చెందారు. ఆదివారం బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు కుమ్మరి యాదయ్యను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ రాజు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సూకురి లింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ దిలీప్, పార్టీ నాయకులు మల్లయ్య, నవీన్, సాయిలు తదితరులు ఉన్నారు.

## ఓట్ల కోసం కాంగ్రెసోళ్లు వస్తారు జాగ్రత్త



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- **అరకొర పథకాలకు మరోసారి మోసపోవద్దు**
- **నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పిలుపు**

నారాయణఖేడ్, జూన్ 22: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం వస్తారని, అప్రమత్తంగా ఉండాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ చేతిలో మరోసారి మోసపోవద్దని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ నేతలపై కేసులు పెడుతూ, నోటీసులు ఇస్తూ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ.15 వేలు రావాల్సిన రైతుబంధు రూ.12 వేలకు తగ్గిందని, అది కూడా రెండు విడతలు ఎగ్గొట్టి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనేక ఆంక్షలు, కోతలతో రైతులకు ఇస్తున్నారన్నారు. గత రెండు పంటలతో కలిపి మొత్తం మూడు పంటల రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌కు స్వస్తిపలికి కోతల కరెంట్ సరఫరా చేస్తుందని, అరకొరగా పంట రుణమాఫీ, అందని సన్నధాన్యం బోనస్ డబ్బులు ఇలా రైతులను నష్టపర్చే విధంగా రేవంత్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. నారాయణఖేడ్ నియోజవర్గాన్ని సస్యశ్యామలం చేసే బసవేశ్వర ఎత్తిపోతల పథకం, కొత్తగా నిర్మించాల్సిన ఎనిమిది కొత్త చెరువుల పనులను కొనసాగించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ ఇండ్ల పేరిట కాంగ్రెస్ నాయకులు ఆడుతున్న డ్రామాల కారణంగా పేదల బతుకు ఇల్లు పీకి పందిరేసినట్లైందని ఎద్దేవా చేశారు. యువతను మభ్య పెట్టేందుకు రాజీవ్ యువవికాసం పేరుతో రుణాలు ఇస్తామని చెబుతున్నా ఇప్పటి వరకు ఏఒక్కరికి కూడా ఇచ్చిన పాపాన పోలేదని, యువకులు మోసపోయి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారం చేపట్టిన తర్వాత విస్మరించిన కాంగ్రెస్ నాయకుల తీరును యువత గురుంచుకోవాలన్నారు. మహిళలకు రూ.2500, వడ్డీలేని రుణం, కల్యాణలక్ష్మితో తులం బంగారం, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ పేరిట ఇలా ప్రతి వర్గాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టి సుపరిపాలన అందించిన బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. రేవంత్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా బయటకువస్తారన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్‌నాయక్, ముజామిల్, పార్శెట్టి సంగప్ప, లక్ష్మణ్‌రావు, జగదీశ్వర్‌చారి, వెంకటేశం, మల్‌గొండ పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకే కిక్‌బాక్సింగ్



సిద్దిపేటలో శ్రీవర్ధినికి గోల్డ్ మెడల్ బహూకరిస్తున్న నిర్వాహకులు

సిద్దిపేట,జూన్22: కిక్ బాక్సింగ్ ఆత్మ రక్షణకే కాకుండా క్రీడారంగంలోనూ రాణించడానికి దోహ దం చేస్తుందని సిద్దిపేట కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సిద్దిపేట కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్ బహూకరించారు. బాలికల విభాగంలో కె శ్రీవర్ధిని గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో సుమారు 30 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 28, 29 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాగ్యరాజ్, రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 2కే రన్

చేర్యాల, జూన్ 22 : గంజాయి, ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా సిద్దిపేటను తయారు చేసేందుకు అన్నివర్గాలు పోలీసులకు సహకరి ంచాలని సీఐ శ్రీను కోరారు.యాంటీ డ్రగ్స్ అవగాహన వీక్ సందర్భంగా ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో సీఐ శ్రీను, ఎస్సై నిరేశ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు.సోషల్ వెల్ఫేర్ స్కూల్ నుంచి చేర్యాల పోలీస్ స్టేషన్ వరకు 2కే రన్‌తో పాటు మానవహారం నిరించారు.మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని యువకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని విద్యా సంస్థల యాజమాన్యాలను కోరారు.విద్యార్థులు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు గమనించాలని, కొందరు చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. మత్తుకు అలవాటు పడి గంజాయి సేవించి జీవితాలు నాశనం చేసుకుంటున్నట్లు తెలిపారు.మత్తు పదార్థాలు సేవిస్తున్న వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామాలు, పట్టణాల్లో మాదకద్రవ్యాల విషయాల్లో అన్నివర్గాలు కఠినంగా వ్యవహరించాలని, యువతను వాటికి దూరంగా ఉంచాలని డ్రగ్స్ రహిత జిల్లాగా సిద్దిపేటను తయారు చేయాలని కోరారు. సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ నర్సింహాచారి, సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా చేర్యాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మానవహారం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని కొండపాక వద్ద బోల్తా పడిన టాటాఏస్ (ఫైల్)

# మృత్యు దారి

### తరుచూ రోడ్డు ప్రమాదాలు

సిద్దిపేట జిల్లాలో 92 కిలోమీటర్ల మేర పొడవు ఉన్న రాజీవ్ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మృతుల కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంటుంది. నాలుగు వరుసలుగా విస్తరించిన రాజీవ్ రహదారి నిర్మాణ సమయంలో లోపాలను సరిచేయలేదు. మూలమలుపులను సరిచేయకపోవడంతో అవే ప్రాంతాలు తరుచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని కొడకండ్ల-రాయవం క్రాసింగ్ వద్ద ప్రమాదకరంగా రాజీవ్ రహదారి

- **సిద్దిపేట జిల్లాలో ప్రమాదకరంగా రాజీవ్ రహదారి**
- **మృతుల కుటుంబాల్లో తీరని విషాదం**
- **గ్రామాల అనుసంధానంరోడ్ల వద్ద ప్రమాద నివారణ చర్యలు శూన్యం**
- **పట్టించుకోని అధికారులు**

గజ్వేల్, జూన్ 22: సిద్దిపేట జిల్లాలో రాజీవ్ రహదారి ములుగు మండలం వంటిమామిడి నుంచి మొదలై బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లి వరకు 92 కిలోమీటర్ల మేర పొడవు ఉంది. ఈ రహదారిపై 15ప్రాంతాల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతాయని పోలీసులు బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. వీటితో పాటు గ్రామాల మూలమలుపుల వద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం సుమారు 500వరకు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో అనేక కుటుంబాల్లో విషాదం అలుముకుంటున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి చెందగా చాలామంది క్షతగాత్రులయ్యారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించడం లేదు. దీంతోపాటు రహదారిపై నిర్మాణ లోపాలు సరిచేయలేదు. వ్యవసాయ పొలాల నుంచి అడ్డంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆయా గ్రామాల వద్ద రోడ్డు దాటే ప్రాంతాల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాజీవ్ రహదారిపై రోజూ వేలాది వాహనాలు అధిక వేగంతో వెళ్తుంటాయి. ఇదే మార్గంలో పోలీస్‌స్టేషన్లు ఉన్నా వేగ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టలేదు. అతివేగంతో వాహనాలు వెళ్లడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మాణ సమయంలో రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించారు. ఆసమయంలో నిర్మాణ లోపాలను సరిచేయలేదు. రహదారి నిర్మాణ సమయంలోనే లోపాలను సరిచేస్తే ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలిగేది కాదు.

### గ్రామాల వద్ద ప్రమాద ఘంటికలు

రాజీవ్ రహదారి వెంబడి ఉన్న గ్రామాల వద్ద రోడ్డు దాటాలంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని దాటాల్సి వస్తున్నది. అతివేగంతో వచ్చే వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టక పోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ములుగు, గౌరారం, రిమ్మనగూడ, కొడకండ్ల, దుద్దెడ క్రాసింగ్ వద్ద రోడ్డు దాటాలంటే ప్రజలు తమప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటాల్సిన పరిస్థితి ఉంది. సిద్దిపేట జిల్లాలోని వంటిమామిడి మార్కెట్ వద్ద ఉదయం సమయంలో మార్కెట్‌కు వచ్చే రైతులు ద్విచక్ర వాహనాలతో రాంగ్‌రూట్‌లో వెళ్తుండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ములుగు చౌరస్తాలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, గ్రామస్తులు రోడ్డు దాటాలంటే జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ములుగు ఎంపీడీవో కార్యాలయం, సింగాయిపల్లి చౌరస్తా, రాణే కంపెనీ ప్రాంతం, రిమ్మనగూడ, కొడకండ్ల, చిన్నకిష్టాపూర్ చౌరస్తా, కుకునూర్‌పల్లి గ్రామ సమీపంలోని క్రాసింగ్ వద్ద, తిమ్మారెడ్డిపల్లి క్రాసింగ్ వద్ద, రంగధాంపల్లి, పొన్నాల, చిన్నకోడూరు మండలం రాముని పట్ల, మందపల్లి, ఇబ్రహీంపూర్ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈప్రాంతాల వద్ద ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపడితే ప్రమాదాలను కొంతమెరకైనా అరికట్టవచ్చని స్థానికులు కోరుతున్నారు.

## డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకోవాలి



నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్ష చేస్తున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల,జూన్22: ప్యారానగర్ డంపింగ్‌యార్డు ఏర్పాటు విరమించుకోవాలని రైతు జేఏసీ నాయకులు వేడుకుంటున్నారు. 138 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా జాప్యం చేస్తుందని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటు జరిగితే ఊరూవాడా ఖాళీ చేసి వలసలు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నల్లవల్లి గ్రామంలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాలు సంయుక్తంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. రాష్ట్ర పాలకవర్గం స్పందించి వెంటనే డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)రద్దు చేసి ఇక్కడి గ్రామాల ప్రజలను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## వనదుర్గ సన్నిధిలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

పాపన్నపేట,జూన్ 22: మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గ భవాని క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో భక్తుల తాకిడిపెరిగింది. సుధూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. మంజీరానదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి,శ్యామ్,బ్రహ్మాచారి.బత్తిని రాజు, నర్సింహులు, వరుణాచారి,నరేశ్,దీపక్ ఏర్పాట్లు చేశారు. వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ,రాముశర్మ,నాగరాజు శర్మ పూజలు నిర్వహించారు.ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



సిద్దిపేటలో యాదవుల ఆత్మగౌరవ సభ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న యాదవ్ సంఘం నేతలు

## మంత్రి వర్గంలో యాదవులకు చోటు కల్పించకపోవడం దారుణం

- **బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్**
- **సిద్దిపేటలో యాదవుల ఆత్మగౌరవ సభ గోడ పత్రిక ఆవిష్కరణ**

సిద్దిపేట టౌన్, జూన్ 22 : గొప్ప చరిత్ర కలిగిన యాదవులకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం దారుణమని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం యాదవుల ఆత్మగౌరవసభ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి కుల, కుటుంబ పాలన చేస్తున్నారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బీసీలకు ప్రధానంగా యాదవులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాదవులకు మంత్రి పదవి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ చైర్మన్లుగా అనేక అవకాశాలు ఇచ్చి సముచిత గౌరవం కల్పించిందని గుర్తుచేశారు.యాదవులతో పాటు మున్నూరు కాపులు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని, వారికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు పార్టీలు, సంఘాలకతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణయాదవ్ , ఐలయ్య, రా ము, నర్సింహులు, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

# తాగునీటి కోసం తండ్లాట



మెదక్ జిల్లా చేగుంట మండలంలోని సోమ్లాతండాలో బోరు బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్న గిరిజనులు

- **మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో బోరు,బావుల నీరే దిక్కు**
- **పది రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్**
- **కాంగ్రెస్ ప్రభుత్వంలో కష్టాలు మొదలు**
- **పట్టించుకోని అధికారులు**

చేగుంట,జూన్22: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. పది రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. గ్రామాలు, గిరిజనతండాల్లో బోరు బావుల నీరే ప్రజలకు దిక్కవుతున్నది. కష్టాలు మొదలవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇంటింటికీ సరిపడా మిషన్ భగీరథ నీరు సరఫరా చేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి,రాంపూర్,సోమ్లా తండాల్లో పది రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. రెండు మూడు బిందెల కంటే ఎక్కువ రాకపోవడంతో గిరిజనులు వ్యవసాయ బోరు, బావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు.అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే నీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని పలువురు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### నీటి సమస్య పరిష్కరించాలి



తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. పది రోజులుగా రెండు మూడు బిందెల కంటే ఎక్కువ మిషన్ భగీరథ నీరు రావడం లేదు. వ్యవసాయ బోరు,బావుల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. సమస్య పరిష్కరించకుంటే రోడ్డు ఎక్కే పరిస్థితి వస్తుంది.

**– లంబాడీలచ్చియ, సోమ్లాతండా, చేగుంట మండలం, మెదక్ జిల్లా**

### వానమ్మా...జాడేదమ్మా...

చిలిపిచెడ్, జూన్ 22: వానకాలం మొదల్లో మురిపించిన వానలు తర్వాత ముఖం చాటేశాయి. నెల రోజుల నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి.వర్షాలు లేక సాగుపై ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో పత్తి చేలో మొలకలను కాపాడుకునేందుకు రైతులు బిందెలు,బకెట్లతో నీరుతెచ్చి పోస్తున్నారు.వర్షాలు పడేకపోతే వేసిన పత్తివిత్తనాలు నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చండూర్‌లో పత్తిమొలకలను కాపాడుకునేందుకు నీరు పోస్తున్న రైతులు